జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
శుక్రవారం, జులై 17, 2026, పేజీలు:7





## ఎస్సీ,ఎస్టీల సంక్షేమం,భద్రతపై
# రాజీ లేదు

-బాధితులకు నష్టపరిహారం అందించాలి -ఎంపీ డాక్టర్ మల్లు రవి



**నాగర్ కర్నూల్ : జులై 16 (ప్రజా జ్యోతి)** సమాజంలో వెనుకబడిన ఎస్సీ,ఎస్టీ వర్గాల సంక్షేమం,భద్రత,సామాజిక న్యాయం,అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతతోపనిచేస్తోందని,ప్రభుత్వఆశయాలకనుగుణంగా జిల్లా యంత్రాంగం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పార్లమెంట్ సభ్యులు డాక్టర్. మల్లు రవి అధికారులను ఆదేశించారు.ఎస్సీ,ఎస్టీలపై జరరుగుతున్న దాడులు,హత్యలు,అత్యాచారాలు,సామాజిక వివక్ష విషయంలోఏమాత్రం నిర్లక్ష్యం సహించబోమని ప్రతి కేసును అత్యంత ప్రాధాన్యతతో విచారించి బాధితులకు సత్వర న్యాయం అందించి ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం,పునరావాసం,సంక్షేమ ప్రయోజనాలను ఆలస్యం లేకుండా అందించాలని అన్నారు.గురువారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ భవనంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ మల్లురవి ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా వ్యాప్తంగా ఎస్సీ,ఎస్టీలపై నమోదైనకేసులు,సంక్షేమ కార్యక్రమాల అమలు,నష్టపరిహార చెల్లింపు,పునరావాస చర్యలపై సుదీర్ఘంగా సమీక్షించారు.సమావేశానికి జిల్లా ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జీ పాటిల్,నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,

## సీసీకుంట పోలీస్ స్టేషన్‌లో
# ఎస్పీ ఆకస్మిక తనిఖీ..


**మహబూబ్‌నగర్, జూలై 16 (ప్రజా జ్యోతి బ్యూరో) :** హబూబ్‌నగర్ జిల్లా సీసీకుంట పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ధరావత్ జానకి ఆకస్మికంగా సందర్శించి స్టేషన్ పనితీరును సమగ్రంగా పరిశీలించారు.






# రేషన్ బియ్యం పక్కదారి..

పట్టించుకోని రెవెన్యూ శాఖ
పోలీస్ శాఖ.. ఎన్ఫోర్స్మెంట్ డీటీ



**నాగర్ కర్నూల్ జులై 16 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గం ఉప్పునుంతల మండలంలోని కాంసానపల్లి గ్రామంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి, కటిక దరిద్రం లో జీవిస్తున్న పేదలకు రెండు పూటల బియ్యం కడుపునిండా పెట్టాలన్న సంకల్పంతో... పేదల రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న నేపథ్యంలో పిడిఎస్ బియ్యం మాఫియా కాంసాన్ పల్లి గ్రామంలోని ఓ కిరాణం వ్యాపారి మండలానికి సంబంధించిన అన్ని గ్రామాల్లో కెళ్ళి... రేషన్ బియ్యం కొనుగోలు చేసి, అక్రమ బియ్యం వ్యాపారం చేస్తున్న ఆ వ్యాపారిపై సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులు గానీ పోలీస్ శాఖ అధికారులు ఎన్ఫోర్స్మెంట్ డిటి హేమ్ల నాయక్ కాసులకు కక్కుర్తి పడి బియ్యం అక్రమవ్యాపారి పై చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని కాంసాన్ పల్లి

## ఆయిల్ ఫామ్ సాగుతో
# లక్షల ఆదాయం

-తక్కువ నీటితో అధిక లాభం, రైతులు ముందుకు రావాలి
-జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



ఎల్‌నినో ప్రభావం.. ప్రత్యామ్నాయ పంటల కార్యాచరణను
# వెంటనే అమలు చేయాలి

- రైతులకు గ్రామస్థాయిలో అవగాహన కల్పించండి
-జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



### ఎస్సీ,ఎస్టీల సంక్షేమం,భద్రతపై

# రాజీ లేదు

జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎల్లపోగు వెంకటస్వామి,చిన్నగళ్ల రమేష్,వెల్దురూ రెనయ్య,గమ్మకొండ రాములు,కే.చందర్,బండ పర్వతాలు,మహ్మద్ అబ్దుల్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.జిల్లాలోని నాగర్‌కర్నూల్,కల్వకుర్తి, కొల్లాపూర్,అచ్చంపేట పోలీసు సబ్ డివిజన్లలో నమోదైన ప్రతి ఎస్సీ,ఎస్టీ అత్యాచారాల కేసును సమావేశంలో పరిశీలించారు.కేసుల ప్రస్తుత దశ, ఎఫ్ఐఆర్ నమోదు,దర్యాప్తు పురోగతి,చార్జిషీట్ దాఖలు, నిందితుల అరెస్టులు,కోర్టు విచారణ, నష్టపరిహారం చెల్లింపులు,పునరావాస చర్యలు వంటి అంశాలపై సంబంధిత డీఎస్పీల నుంచి వివరాలు తీసుకుని పౌరహక్కుల రక్షణ చట్టం అట్రాసిటీ నివారణచట్టం (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ --పీవోఏ) చట్టాలను ఖచ్చితంగా అమలయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టాలని,ఎస్టీ అట్రాసిటీ కేసులను సంబంధిత శాఖల సమన్వయంతో తక్షణమే పరిష్కరించి బాధితులకు న్యాయంచేసేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కేసులపై విచారణ చర్యలను వేగవంతం చేసి బాధితులకు న్యాయం జరిగేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని,దీంతో పాటు అధికారులు ఎఫ్.ఐ.ఆర్ నమోదు అయిన వెంటనే విచారణ దశలోఉన్న బాధితులకు నిబంధనల మేరకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ,ఎస్టీలకు సంబంధించిన ప్రతికేసు అత్యంత సున్నితమైనదిగా పరిగణించి చట్టపర చర్యల్లో అలసత్వం వహించవద్దని బాధితులకు న్యాయం అందించే విషయంలో ఏ శాఖ నిర్లక్ష్యం చేసినా ఉపేక్షించబోమని,కేసునమోదు నుంచి అంతిమ తీర్పు వచ్చే వరకు బాధితుల కుటుంబాలకు అండగా నిలవాలన్నారు.జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ,ఎస్టీల సంక్షేమం,భద్రతకు జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని,ఎస్సీ,ఎస్టీ పౌర హక్కుల పరిరక్షణ చట్టం1955,ఎస్సీ,ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం 1989 ప్రకారం నమోదయ్యే ప్రతి కేసును జిల్లా స్థాయిలో పర్యవేక్షిస్తున్నామని బాధితులకు ప్రభుత్వం అందించే నష్టపరిహారం, పునరావాసం,సంక్షేమ సదుపాయాలు సకాలంలో అందేలా శాఖలతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటున్నామన్నారు.జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్ కమిటీకి సమగ్ర నివేదిక సమర్పించిన అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ,ఎస్టీలపై జరిగే దాడులు,అత్యాచారాలు, వివక్ష కేసుల పరిష్కారానికి పోలీసు యంత్రాంగం ముందుకు సాగుతోందని, బాధితులకు త్వరగాన్యాయం అందించడమే లక్ష్యంగా ప్రతి కేసును సున్నితంగా,పారదర్శకంగా విచారిస్తున్నామని ఎస్సీ,ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం 1989 నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ,కేసు నమోదు,దర్యాప్తు,చార్జి షీట్ దాఖలు,నిందితుల అరెస్టు వరకు ప్రతి దశను పర్యవేక్షిస్తున్నామని,పెండింగ్ కేసును నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, బాధితులకు ప్రభుత్వం కల్పించే నష్టపరిహారం,పునరావాసం,రక్షణచర్యలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటు నిందితులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబాలకు పూర్తి స్థాయిలో పోలీసు శాఖ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ,ఎస్టీ,అట్రాసిటీ కేసులు లేకుండా చూడాల్సిన అవసరం ఉందని ఈ విషయంలో కేసులు నమోదైన వెంటనే త్వరితగతిన దర్యాప్తు ప్రారంభించి వీలైనంత త్వరగా పూర్తి చేసి వారికి న్యాయం జరిగేలా చూడాలని అన్నారు.కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూఎస్సీ,ఎస్టీల భద్రత విషయంలో రాజీ ఉండదని,కేసు పురోగతి,నష్టపరిహారం చెల్లింపు,పునరావాస చర్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అరుణారెడ్డి,జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ కార్యదర్శి,షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఉమాపతి,జిల్లా కార్మిక శాఖ అధికారి రాజ్‌కుమార్,డీఆర్డీఓ చిన్న ఓబులేసు,డిప్యూటీ సీఎంఓ గోపాల్ నాయక్,ఆర్డీవోలు,డీఎస్పీలు,జిల్లా అధికారులు,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రేషన్ బియ్యం పక్కదారి..

గ్రామ ప్రజల నుంచి సర్వత్ర విమర్శలు అధికంగానే ఉన్నాయి.. ఈ బియ్యం వ్యాపారి తమ కిరాణం షాపులో నిత్యవసర వస్తువుల ఆశ చూపి... బియ్యం తక్కువ ధరకు కొని పేద ప్రజలకు నట్టేట ముంచుతున్నాడని ప్రజల నుంచి అనేక ఆరోపణలు ఉన్నాయి.. కంసన్ పల్లి గ్రామం ప్రధాన రహదారిపై ఉన్న కొత్త షట్టర్లలో క్వింటాళ్లకొద్ది రేషన్ బియ్యం డంపు చేస్తున్న సంబంధిత అధికారులు ఈ బియ్యం వ్యాపారిపై కేసులు నమోదు చేసి, పేదల బియ్యం పేదలకు చెందే విధంగా సంబంధిత అధికారులు కృషి చేయాలని కాంసన్ పల్లి గ్రామానికి చెందిన యువకులు ప్రజలు కోరారు. అదేవిధంగా ఆ వ్యాపారి కిరాణా షాప్ లో.. ఇష్టానుసారంగా బెల్టు షాపు నిర్వహించి, మద్యంపై క్వాటర్ ఆఫ్,ఫుల్ బాటిల్ పై ఇష్టానుసారంగా అధిక రేట్లకు విక్రయిస్తూ...దోచుకుంటున్నాడని మద్య ప్రియుల నుంచి అనేక ఆరోపణలు ఉన్నాయి. అక్రమ బెల్ట్ షాపు నిర్వహిస్తున్న..? ఎక్సైజ్ శాఖ తెలకపల్లి ఎస్సై గాని సిబ్బంది పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ వ్యాపారి ఉదయం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు మద్యం అమ్మడం ద్వారా గ్రామంలో మనశ్శాంతి కోల్పోయిందని అదే క్రమంలో యువకుల మధ్య కొట్లాటలు అధికమయ్యాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో వసతులు కన్నా గ్రామంలో మద్యం ఏరులై పారుతుందని.. ఎక్సైజ్ శాఖ అధికారులకు గ్రామంలో అక్రమ బెల్ట్ షాపులు కనిపిస్తా లేవా అని ప్రశ్నించారు..? సంబంధిత అధికారులు కంసాన్పల్లి గ్రామంలో బెల్ట్ షాపులపై చర్యలు చేపట్టి, అమ్మకుండా చర్యలు చేపట్టాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు ప్రజలు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఉప్పునుంతల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బియ్యం మాఫియా... సంబంధిత అధికారుల అండదండలతోనే అక్రమ బియ్యం వ్యాపారం కొనసాగిస్తున్నామని.. తెలపడం విశేషం. సంబంధిత రెవెన్యూ శాఖకు పోలీస్ శాఖకు నెల నెల మామూలు ఇస్తున్నాము మాకు అడ్డు అదుపు లేదని బియ్యం మాఫియా స్పష్టం చేస్తున్నది. కాబట్టి సంబంధిత రెవెన్యూ పోలీస్ శాఖ అధికారులు రాత్రి వేళల్లో... ముందుగా కార్లు ఎస్కార్ట్ గా బయలుదేరి ఆ తర్వాత అక్రమ బియ్యం లోడ్లతో డీసీఎం వాహనాలతో పాటు చిన్న చిన్న వాహనాలలో కాంసాన్పల్లి మీదుగా కల్వకుర్తి ప్రాంతానికి తరలిస్తున్నారని విశ్వసనీయమైన సమాచారం. ఈ బియ్యం మాఫియా ఆగడాలను అరికట్టాల్సిన సంబంధిత శాఖ అధికారులపై ఉందని ప్రజలు కోరారు

# ఆయిల్ ఫామ్ సాగుతో లక్షల ఆదాయం

నాగర్ కర్నూల్ జులై 16 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)

వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా రైతులు అధిక ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని, ముఖ్యంగా ఆయిల్ ఫామ్ సాగు లాభదాయకమైన పంటగా నిలుస్తోందని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అన్నారు. అచ్చంపేట మండలంలోని లింగోటం గ్రామానికి చెందిన ప్రగతిశీల రైతు రాజశేఖర్ గౌడ్ తన 4 ఎకరాల్లో సాగు చేసిన ఆయిల్ ఫామ్ తోటను జిల్లా ఉద్యాన శాఖ, ఇతర రైతులు , ఆయిల్ ఫామ్ కంపెనీ అధికారులతో కలిసి గురువారం కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పరిశీలించారు.ఈ సందర్భంగా తోటలో మొక్కల పెరుగుదల, దిగుబడి, నీటి వినియోగం, నిర్వహణ పద్ధతులు, కోత విధానాలను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్ రైతుతో మాట్లాడి పంట సాగుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ... లింగోటం గ్రామ రైతు రాజశేఖర్ గౌడ్ సాధించిన విజయం ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. సంప్రదాయ పంటలతో పాటు మార్కెట్ డిమాండ్ ఉన్న ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని, ముఖ్యంగా వరికి బదులుగా తక్కువ నీటితో అధిక ఆదాయం ఇచ్చే ఆయిల్ ఫామ్ వంటి పంటలను సాగు చేయడం ద్వారా రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాన్ని రైతులందరూ సద్వినియోగం..చేసుకోవాలని, వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులకు ఆయిల్ ఫామ్ సాగు, నిర్వహణ, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ప్రగతిశీల రైతు రాజశేఖర్ గౌడ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. రైతు సాధించిన విజయాన్ని కొనియాడుతూ, ఇదే స్ఫూర్తితో మరింత మంది రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు అడుగులు వేయాలని కలెక్టర్ కోరారు. భారత వాతావరణ శాఖ అధికారం వెల్లడించిన వివరాల ప్రకారం నాగర్ కర్నూల్ జిల్లాలో ఈ సంవత్సరం వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం వంటి పరిస్థితులు ఉన్నాయని, ప్రాజెక్టుల్లో కూడా నీటి నిలువలు కేవలం త్రాగునీటి అవసరాల కోసమే ఉన్నాయని, రైతులు ఈ విషయాలను అర్థం చేసుకోని, వరికి ఇతర ప్రత్యామ్నాయ పంటలను పండించేలా ముందుకు రావాలని కలెక్టర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. అక్కడ వచ్చిన కొంతమంది రైతులు 30 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగుకు ముందుకు రాగా, కలెక్టర్ వారి అందరిని అభినందించి, అందుకు అవసరమైన చర్యలను వెంటనే తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. అంతకు ముందు. రైతు రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ..., నాలుగేళ్ల క్రితం నాలుగు ఎకరాల్లో ఆయిల్ ఫామ్ మొక్కలను నాటినట్లు తెలిపారు.ఆయిల్ ఫామ్ సాగులో డ్రిప్ ఇరిగేషన్‌నువినియోగిస్తున్నట్లు రాజశేఖర్ గౌడ్ చెప్పారు. ఈ పంటకు నీటి అవసరం తక్కువగా ఉండటంతో పాటు, నీటి వినియోగం కూడా సమర్థవంతంగా ఉంటుందని వివరించారు. సరైన నిర్వహణ, ఎరువుల వినియోగం,సమయానుకూల సంరక్షణతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశం మాట్లాడుతూ...., ఆయిల్ ఫామ్ తోటల్లో పండిన గెలలను ఎలా గుర్తించాలి, కోతకు సరైన సమయం ఏది, ఏ విధానంలో గెలలను కోయాలి, కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి వంటి అంశాలను కలెక్టర్‌తో పాటు అక్కడికి వచ్చిన రైతులకు వివరించారు. ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాన్ని అందజేస్తోందని తెలిపారు. రైతు మొక్కలు నాటిన సంవత్సరం నుంచి వరుసగా నాలుగు సంవత్సరాల పాటు ప్రతి ఎకరానికి రూ.4,200 చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఈ పథకం ద్వారా రైతులకు ప్రారంభ దశలో ఆర్థిక భారం తగ్గుతుందని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి వెంకటేశం, అచ్చంపేట డివిజన్ ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, నాగర్ కర్నూల్ డివిజన్ ఉద్యాన శాఖ అధికారి జగన్, వ్యవసాయ అధికారులు, గ్రామ సర్పంచ్ వివిధ గ్రామాలకు చెందిన రైతులు తదితరులు పాల్గొన్నారు.

### సీసీకుంట పోలీస్ స్టేషన్‌లో

# ఎస్పీ ఆకస్మిక తనిఖీ..

ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. స్టేషన్‌లో నమోదైన పెండింగ్ కేసులు, గ్రేవ్, నాన్-గ్రేవ్ కేసుల దర్యాప్తు పురోగతి, వారెంట్ల అమలు, పెండింగ్ పిటిషన్లు, కోర్టు విచారణలో ఉన్న కేసులు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై ఎస్పీ సమీక్ష నిర్వహించారు. ప్రతి కేసును నాణ్యమైన దర్యాప్తుతో త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో నేరాల నియంత్రణ కోసం బీట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, గ్రామాల వారీగా అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని పేర్కొన్నారు.

సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి, ఆర్థిక మోసాల బారిన పడకుండా అప్రమత్తం చేయాలని ఎస్పీ సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా నమోదు చేసి నిర్ణీత గడువులో పరిష్కరించాలని ఆదేశించారు.

స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది క్రమశిక్షణను కూడా పరిశీలించిన ఎస్పీ, పెండింగ్ కేసుల్లో పటిష్టమైన సాక్ష్యాధారాలతో ఛార్జిషీట్లు దాఖలు చేసి నేరస్థులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల్లో పోలీసు శాఖపై మరింత విశ్వాసం పెరిగేలా సేవలు అందించాలని సీసీకుంట ఎస్ఐ కృష్ణ ఓబుల్ రెడ్డితో పాటు సిబ్బందికి పలు దిశానిర్దేశాలు చేశారు. ఈ తనిఖీలో సీసీకుంట పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఎల్‌నినో ప్రభావం.. ప్రత్యామ్నాయ పంటల కార్యాచరణను

# వెంటనే అమలు చేయాలి

మహబూబ్‌నగర్, జూలై 16 ( ప్రజా జ్యోతి బ్యూరో) : ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ వానాకాలానికి సంబంధించి అత్యవసర ప్రత్యామ్నాయ పంటల (కంటింజెన్సీ క్రాప్ ప్లాన్) కార్యాచరణ ప్రణాళికను వెంటనే అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఆశించిన స్థాయిలో వర్షాలు కురవని నేపథ్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికపై రైతులకు మార్గనిర్దేశం చేయాలని అధికారులకు ఆదేశించారు. వరి సాగుపై మాత్రమే ఆధారపడకుండా తక్కువ నీటితో సాగయ్యే పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజల పంటలను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. పంటల మార్పిడి వల్ల రైతులకు ఆర్థిక ప్రయోజనాలు కలగడంతో పాటు భూసార పరిరక్షణ, భూగర్భ జలాల సంరక్షణకు కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. కోయిల్‌సాగర్ రిజర్వాయర్‌లో ఉన్న నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కాలువల ద్వారా నీటి సరఫరా తగ్గితే బోర్‌వెల్లపై కూడా ప్రభావం ఉంటుందని, విచక్షణారహితంగా బోర్‌వెల్లు తవ్వడం శాశ్వత పరిష్కారం కాదని హెచ్చరించారు. నీటి వినియోగంలో బాధ్యతాయుతమైన విధానాలను పాటించాలని సూచించారు.

ప్రతి మండలంలో గ్రామసభలు నిర్వహించి రైతులతో నేరుగా చర్చించాలని, ఇప్పటికే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి విజయవంతమైన రైతులను గుర్తించి వారి అనుభవాలను ఇతర రైతులతో పంచుకునే కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు తోటి రైతుల అనుభవాలను ఎక్కువగా విశ్వసిస్తారని, అందువల్ల విజయవంతమైన రైతులను ఆదర్శంగా నిలపాలని సూచించారు. త్వరలో తాను కూడా ఎంపిక చేసిన మండలాలను సందర్శించి రైతులతో సమావేశమవుతానని వెల్లడించారు.

సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చేపడుతున్న చర్యలను వివరించారు. ప్రస్తుతం మూడు దశల్లో అత్యవసర ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక అమలు చేస్తున్నామని, వర్షపాతం, భూగర్భ జలాలు, చెరువులు, కాలువల నీటి లభ్యతను నిరంతరం సమీక్షిస్తూ రైతులకు తగిన సూచనలు అందిస్తున్నామని తెలిపారు.

జొన్న, సజ్జ, రాగి, ఆముదం, కంది, మొక్కజొన్న, నల్ల మినుములు, నువ్వులు, ఉలవలు, అలసందతో పాటు తక్కువ కాలంలో దిగుబడి ఇచ్చే కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వేణుగోపాల్‌తో పాటు సాగునీటి, విద్యుత్, పశు సంవర్ధక శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ రూపొందించిన రైతు సూచనల కరపత్రాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆవిష్కరించారు.

# నాణ్యతలో రాజీ పడొద్దు

-నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- ప్రతి వారం పనుల్లో స్పష్టమైన పురోగతి కనిపించేలా చర్యలు తీసుకోవాలి

- క్షేత్రస్థాయిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించిన

- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్





**నాగర్ కర్నూల్ జులై 16 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ విద్యార్థులకు ఆధునిక, నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ప్రతిష్ఠాత్మక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ పనులను నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ గురువారం ఉప్పునుంతల మండలంలోని రాయిచేడ్ గ్రామంలో క్షేత్రస్థాయిలో, నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, ప్రస్తుత దశ, ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.నిర్మాణ స్థలానికి చేరుకున్న కలెక్టర్, పనులు జరుగుతున్న ప్రాంతాన్ని పూర్తిగా పరిశీలించి అధికారుల నుంచి వివరాలను అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వం ఆమోదించిన డిజైన్, మ్యాప్, సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగానే పనులు కొనసాగాలని స్పష్టం చేశారు. అనుమతులు పొందిన నమూనాలో ఎలాంటి మార్పులు చేయకుండా, నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం నిర్మాణాన్ని చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం కొనసాగుతున్న బేస్‌మెంట్ పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించిన, పనుల వేగాన్ని మరింత పెంచాలని సూచించారు. నిర్మాణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన యంత్రాలు, నిర్మాణ సామగ్రి, కార్మికులను సమకూర్చి పనులను వేగవంతం కొనసాగించాలని, ప్రతి వారం పనుల పురోగతి స్పష్టంగా కనిపించేలా లక్ష్యాలను నిర్దేశించుకుని అమలు చేయాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, భవనం ఎంతో కాలం పాటు విద్యార్థులకు..ఉపయోగపడేలా ప్రతి దశలో ఇంజినీరింగ్ ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, నాణ్యతలో ఏమాత్రం రాజీ పడవద్దని హెచ్చరించారు. నిర్మాణానికి వినియోగించే సిమెంట్, స్టీల్, కాంక్రీట్ తదితర సామగ్రి నాణ్యతను నిరంతరం పరీక్షిస్తూ పనులు కొనసాగించాలని నిర్మాణ ప్రాంగణంలో భద్రతా చర్యలను కూడా కచ్చితంగా అమలు చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించిన కలెక్టర్, ప్రతి దశ పూర్తయిన వెంటనే నాణ్యతా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. నిర్మాణంలో ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. అచ్చంపేట నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడంలో ఈ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల కీలకంగా మారుతుందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు ఆధునిక తరగతి గదులు, వసతి గృహాలు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు, డైనింగ్ హాల్ తదితర సౌకర్యాలతో కూడిన సమగ్ర విద్యా వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించాలనే లక్ష్యంతోనే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణాలనుచేపట్టిందన్నారు.నిర్మాణ పనులు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. పనుల పురోగతిపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తామని, అలసత్వం లేదా నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై బాధ్యత నిర్ధారించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభివృద్ధి పనుల్లో వేగం, నాణ్యత రెండూ సమానంగా ఉండాలని, ప్రజాధనం వృథా కాకుండా ప్రతి రూపాయి ఫలితమిచ్చేలా అధికారులు పనిచేయాలని సూచించారు.జిల్లా కలెక్టర్ వెంట ఈడబ్ల్యూఐడిసి ఈఈ , అచ్చంపేట ఆర్డీఓ యాదగిరి, ఇంజనీరింగ్ అధికారులు, మండల స్థాయి అధికారులు తదితరులు ఉన్నారు

# ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఓటరు భాగస్వామి కావాలి

-వివరాలు సమర్పించని పక్షంలో ఓటరు జాబితాలో పేరు నమోదు కాదు

-ఆగస్టు 3 వరకు గడువు పొడిగింపు

-జిల్లా కలెక్టర్ హెమంత్ కేశవ్ పాటిల్



**నాగర్ కర్నూల్ : జులై 16 ( ప్రజా జ్యోతి )**

ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు మూలస్తంభమని, అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరు నమోదును ధృవీకరించుకుని సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో తప్పనిసరిగా భాగస్వామి కావాలని జిల్లా కలెక్టర్ హెమంత కేశవ్ పాటిల్ అన్నారు.గురువారం అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని బల్మూరు మండలం కొండనాగుల గ్రామంలోని 216 వ, పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి ఓటరు జాబితా సవరణ కార్యక్రమ అమలునుపరిశీలించి బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ) పార్వతమ్మ నిర్వహిస్తున్న ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను కలెక్టర్ స్వయంగా పరిశీలించి ఓటర్ల వివరాలను ధృవీకరిస్తూ ఫోటోలను స్వయంగా తీసి ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి నమోదు ప్రక్రియను పరిశీలించి డిజిటల్ వివరాల నమోదు,పత్రాల అప్‌లోడ్, ఫోటో ధృవీకరణ అంశాలపైబీఎల్ఓకు పలు సూచనలు చేశారు.ప్రక్రియలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని భారత ఎన్నికల సంఘం రూపొందించే ఓటరు జాబితా సంపూర్ణంగా,పారదర్శకంగా,తప్పులులేకుండా ఉండేందుకు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రక్రియలో ప్రతి ఓటరు తన వ్యక్తిగత వివరాలను ధృవీకరించి అవసరమైన పత్రాలను బీఎల్‌ఓకు అందజేయడం అత్యంత కీలకమని,ప్రతి ఇంటికి బీఎల్‌ఓలు వెళ్లి వివరాలను సేకరిస్తున్నందున ప్రజలు వారికి పూర్తి సహకారం అందించాలన్నారు.ఓటరు వివరాలు సమర్పించనివారు లేదా అవసరమైన ధృవీకరణ పత్రాలు అందించని వారి పేర్లు ఓటరు జాబితాలో నమోదు,కొనసాగింపులో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుందని, అందువల్ల ప్రతి అర్హులైన ఓటరు బాధ్యతగా స్పందించి తమ వివరాలను సమర్పించాలని అన్నారు.ప్రజలు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా ముందుగానే ప్రక్రియను పూర్తి చేసుకోవాలని యువకులు,దివ్యాంగులు, మహిళలు,వృద్ధులు,సహా ప్రతి వర్గానికి చెందిన అర్హులైన ఓటర్లు కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు.గ్రామాలలో అవగాహన కల్పించేందుకు అధికారులు,బీఎల్ఓ,ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని,ఓటు హక్కును పరిరక్షించుకోవడం పౌరుడి రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని,ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఓటురు పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ అన్నారు.

కేంద్ర ఎన్నికల సంఘం ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక సమగ్ర సవరణ గడువును ఆగస్టు 3వ,తేదీ వరకు పొడిగించినందున ఈ అవకాశాన్ని ప్రతి ఓటరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు,తదితరులు ఉన్నారు.



## మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి జూలై 20 నిరాహార దీక్షను విజయవంతం చేయాలి



**వడ్డేపల్లి జూలై 16(ప్రజా జ్యోతి):**

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న హైదరాబాద్‌లో నిర్వహించనున్న నిరాహార దీక్షను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ పిలుపునిచ్చారు.గురువారం వడ్డేపల్లిలో నిర్వహించిన మున్సిపల్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మరణించిన లేదా అనారోగ్యానికి గురైన మున్సిపల్ కార్మికుల స్థానంలో వారి వారసులకు ఉద్యోగాలు కల్పించేలా సీడీఎంఏ తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.కార్మికులపై రాజకీయ వేధింపులు నిలిపివేయాలని,కనీస వేతనాలు అమలు చేయాలని ఆయన కోరారు.విధి నిర్వహణలో గాయపడిన కార్మికులకు ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.జూలై 20న జరిగే నిరాహార దీక్షకు మున్సిపల్ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు సంజీవరాజు,మధు,పరుశురాముడు,దావీదు,చందు,వీరేష్,జహీరా బేగం,జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బ్రేక్యల్ ప్లెక్సస్ ఇంజురీకి సకాలంలో చికిత్సతో చేయి మళ్లీ పనిచేసే అవకాశం

### – అవగాహన లోపంతో చికిత్స ఆలస్యమైతే శాశ్వత వైకల్యానికి దారితీస్తుంది: డా. పి. ప్రకాష్

**మహబూబ్‌నగర్, జూలై 16 (ప్రజా జ్యోతి బ్యూరో)**

: రోడ్డు ప్రమాదాల అనంతరం చేయి కదలకపోవడం, స్పర్శ కోల్పోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే నిపుణులను సంప్రదిస్తే చేయి తిరిగి సాధారణ స్థితికి వచ్చే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని హైదరాబాద్ యశోద హాస్పిటల్ హైటెక్ సిటీ యూనిట్ ప్లాస్టిక్ అండ్ రీకన్‌స్ట్రక్టివ్ సర్జన్, బ్రేక్యల్ ప్లెక్సస్ నిపుణుడు డా. పి. ప్రకాష్ తెలిపారు. గురువారం మహబూబ్‌నగర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బ్రేక్యల్ ప్లెక్సస్ ఇంజురీ అనేది చేతికి కదలికలు, స్పర్శను అందించే నరాలు దెబ్బతినే తీవ్రమైన సమస్య అని వివరించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహన ప్రమాదాల్లో యువత, టీనేజ్ వయస్సు వారిలో ఈ గాయాలు అధికంగా నమోదవుతున్నాయని చెప్పారు. రోడ్డు ప్రమాదం తర్వాత చేయి పూర్తిగా పనిచేయకపోవడం, భుజం లేదా మోచేయి కదలకపోవడం, చేయి చచ్చుబడినట్లు అనిపించడం వంటి లక్షణాలు కనిపించినా చాలామంది వాటిని నిర్లక్ష్యం చేస్తూ ఫిజియోథెరపీతోనే సరిపెట్టుకుంటున్నారని, దీంతో చికిత్స ఆలస్యం కావడంతో శస్త్రచికిత్స ఫలితాలు ఆశించిన స్థాయిలో ఉండవని ఆయన పేర్కొన్నారు.దెబ్బతిన్న నరాల తీవ్రతను బట్టి నరాలను తిరిగి కలపడం, నర్వ్ ట్రాన్స్‌ఫర్, కండరాల మార్పిడి, టెండన్ ట్రాన్స్‌ఫర్ వంటి ఆధునిక శస్త్రచికిత్సల ద్వారా చేతి పనితీరును గణనీయంగా పునరుద్ధరించవచ్చని డా. ప్రకాష్ తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే సరైన వైద్యుడిని సంప్రదించి చికిత్స ప్రారంభిస్తే రోగులు తిరిగి తమ దైనందిన పనులను స్వయంగా చేసుకునే స్థాయికి చేరుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. బ్రేక్యల్ ప్లెక్సస్ ఇంజురీపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు యశోద హాస్పిటల్ హైటెక్ సిటీ యూనిట్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల బాధితులు, వారి కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది ఈ అవకాశాన్ని వినియోగించుకుని సకాలంలో నిపుణుల సలహాలు పొందాలని ఆయన కోరారు.



# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

### - మొహమ్మదాబాద్ పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో డా. ఏ. శ్రీనివాసులు..



**మహబూబ్‌నగర్, జూలై 16 (ప్రజా జ్యోతి బ్యూరో):**
జిల్లాలో సీజనల్ వ్యాధుల నివారణ, నియంత్రణకు క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డా. ఏ. శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. గురువారం మొహమ్మదాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన అక్కడ అందుతున్న వైద్య సేవలను సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఫార్మసీ, ల్యాబొరేటరీ, వార్డులను పరిశీలించిన డీఎంహెచ్‌వో, రోగులకు నాణ్యమైన, సమర్థవంతమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. రోగులకు అవసరమైన మందులు, పరీక్షలు, చికిత్సలు సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు. అనంతరం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో హెల్త్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వర్షాకాలంలో ప్రబలే మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, అతిసార వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకుని ప్రతి గ్రామంలో విస్తృత చర్యలు చేపట్టాలని సూచించారు.
వ్యాధుల నియంత్రణలో హెల్త్ అసిస్టెంట్ల పాత్ర కీలకమని పేర్కొన్న ఆయన, ఇంటింటి అవగాహన కార్యక్రమాలు, దోమల నివారణ చర్యలు, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. మొహమ్మదాబాద్ పీహెచ్‌సీ తనిఖీ సందర్భంగా జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా. శైలజ, లెప్రసీ & ఎయిడ్స్ ప్రోగ్రామ్ అధికారి డా. రాజు, డా. పులి విద్య, పీహెచ్‌సీ వైద్యాధికారి డా. జరీనా బాను, రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డా. శివకాంత్, డా. రాజు, హెల్త్ ఎడ్యుకేటర్లు హన్మంతు, నరసింహ, ఎంపీహెచ్‌ఈఓలు అశోక్ రాజు, సుభాష్ చంద్ర, డీపీఓ సీతారామ్ గౌడ్‌తో పాటు జిల్లాలోని హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# కేజీబీవీల్లో ఇంటర్ తరగతులు కొనసాగించాలి

### పీడీఎస్‌యూ డిమాండ్



**అయిజ జూలై 16(ప్రజా జ్యోతి)**
:అయిజ మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పీడీఎస్‌యూ జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు హాలింపాష మాట్లాడుతూ, ఇటిక్యాల,రాజోలి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) ఇంటర్మీడియట్ కోర్సులు ఉంటాయని అధికారికంగా ప్రకటించి విద్యార్థినుల నుంచి దరఖాస్తులు స్వీకరించి,కొన్ని రోజుల పాటు తరగతులు నిర్వహించిన అనంతరం ఇప్పుడు అనుమతులు లేవని చెప్పడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వ ప్రకటనను నమ్మి పేద,గ్రామీణ,వెనుకబడిన కుటుంబాలకు చెందిన వందలాది మంది విద్యార్థినులు ఇతర ప్రభుత్వ,ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు తీసుకోకుండా కేజీబీవీలపైనే ఆశలు పెట్టుకున్నారని తెలిపారు.ఇప్పుడు అకస్మాత్తుగా అనుమతులు లేవని ప్రకటించడంతో వారి విద్యా సంవత్సరం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.ఇటిక్యాల,రాజోలి కేజీబీవీల్లో సుమారు 200 మంది విద్యార్థినుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని,ఇంటర్మీడియట్ బోధన కోసం పనిచేస్తున్న 12 మంది లెక్చరర్ల ఉపాధి కూడా ప్రమాదంలో పడిందని పేర్కొన్నారు. విద్యార్థినుల విద్యతో పాటు అధ్యాపకుల ఉపాధిని కూడా ప్రభుత్వం దృష్టిలో ఉంచుకోవాలని కోరారు.ఈ సందర్భంగా పీడీఎస్‌యూ పలు డిమాండ్లు చేసింది. కేజీబీవీల్లో దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హ విద్యార్థినికి వెంటనే సీటు కేటాయించాలని, అవసరమైతే అదనపు సీట్లు,అదనపు సెక్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేసింది. ఇంటర్మీడియట్ కోర్సులు ఉన్నాయని ప్రకటించి విద్యార్థినులను తప్పుదోవ పట్టించిన బాధ్యులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరింది.అలాగే ఇటిక్యాల, రాజోలి కేజీబీవీల్లో ఇంటర్మీడియట్ తరగతులను యథావిధిగా కొనసాగించేందుకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలని,పరిపాలనా సమస్యలు ఉంటే వాటిని తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేసింది.ఒకవేళ అక్కడ ఇంటర్మీడియట్ కొనసాగించడం సాధ్యం కాకపోతే,దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులందరికీ సమీప ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వెంటనే ప్రవేశాలు కల్పించి,హాస్టల్ వసతి, పాఠ్యపుస్తకాలు,ఇతర సౌకర్యాలను ఉచితంగా అందించాలని కోరింది.200 మంది విద్యార్థినుల భవిష్యత్తుతో,12 మంది లెక్చరర్ల ఉపాధితో ప్రభుత్వం చెలగాటం ఆడకూడదని,ఇప్పటికే ప్రారంభమైన తరగతులను నిలిపివేయకుండా ప్రతి అర్హ విద్యార్థినికి సీటు కేటాయిస్తూ కేజీబీవీల్లో ఇంటర్మీడియట్ విద్యను కొనసాగించేలా ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని హాలింపాష డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు చిరంజీవి,శ్రీశైలం,ప్రేమరాజు,వినయ్ కుమార్, గంగయ్య,రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## నీటి సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

### మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి



**వడ్డేపల్లి జూలై 16(ప్రజా జ్యోతి):**
వడ్డేపల్లి పురపాలక సంఘం పరిధిలోని 3,5,7 వార్డుల్లో గురువారం"జల్ సంవాద్"కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నీటి సంరక్షణ, వర్షపు నీటి నిల్వ,భూగర్భ జలాల పరిరక్షణ,నీటి వృథా నివారణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.అశోక్ రెడ్డి మాట్లాడుతూ,నీరు ప్రతి జీవికి అమూల్యమైన ప్రకృతి సంపద అని పేర్కొన్నారు. ప్రతి నీటి బొట్టును విలువైనదిగా భావించి పొదుపుగా వినియోగించాలని సూచించారు. ప్రతి ఇంటిలో రైన్‌వాటర్ హార్వెస్టింగ్ (ఇంకుడు గుంతలు) ఏర్పాటు చేయడం ద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకించి భూగర్భ జలాలను పెంపొందించవచ్చని తెలిపారు. నీటి వనరులను పరిరక్షించడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని,నీటి సంరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు,సిబ్బంది,సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.నీటి సంరక్షణపై ప్రజల్లో మరింత విస్తృత అవగాహన కల్పించేందుకు సమిష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు.

## కారుణ్య నియామకాలకు కౌన్సెలింగ్.

### 9 మందికి ప్రభుత్వ ఉద్యోగాల కేటాయింపు

**మహబూబ్‌నగర్, జూలై 16 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
కారుణ్య నియామకాల ప్రక్రియలో భాగంగా అర్హులైన అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 23 మంది అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించగా, వారిలో 15 మంది జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు, 8 మంది అటెండర్ పోస్టులకు హాజరయ్యారు. రోస్టర్ పాయింట్ల ప్రకారం అభ్యర్థుల అర్హతలను పరిశీలించి నలుగురిని వివిధ ప్రభుత్వ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్లుగా, ఐదుగురిని అటెండర్లుగా నియమించారు.
నియామకాల ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జిల్లా పరిపాలన అధికారి సువర్ణరాజు, సంబంధిత శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది, అభ్యర్థులు పాల్గొన్నారు.



# చిన్నమారు లిఫ్ట్‌లో చోరీ కలకలం

**చిన్నంబావి, జూలై 16 (ప్రజాజ్యోతి)**
వ్యవసాయానికి జీవనాడిగా నిలిచిన చిన్నమారు లిఫ్ట్ ఇరిగేషన్ కేంద్రంపై మరోసారి దొంగల కన్ను పడింది. మండలంలోని పెద్దమారూర్ సమీపంలోని చిన్నమారు లిఫ్ట్ ఇరిగేషన్ కేంద్రంలో గుర్తుతెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్‌ను పూర్తిగా కిందకు వదిలేసి, అందులో ఉన్న విలువైన కాపర్ వైర్లను అపహరించారు. ఇదే కేంద్రంలో వరుసగా మూడోసారి చోరీ జరగడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న చిన్నమారు గ్రామ రైతు కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచ్ మద్దూరి శంకర్, రైతు కమిటీ అధ్యక్షుడు పింజరి భాష, రైతు నాయకుడు గూడెపు శివారెడ్డి, రైతు సమన్వయ కమిటీ మాజీ చిన్న మారు మద్దిలేటి మోహన్‌తో పాటు పలువురు రైతులు గురువారం చోరీ జరిగిన ఘటనాస్థలాన్ని సందర్శించి ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. దొంగలను వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని, డిమాండ్ చేశారు.ఆరు వేల ఎకరాల సాగుకు ఆధారం.ఈ లిఫ్ట్ ద్వారా కొప్పునూరు, చిన్నమారు, పెద్దమారూర్, వెల్టూరు గ్రామాలకు చెందిన సుమారు ఆరు వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. ఇలాంటి కీలకమైన ప్రాజెక్టును వరుసగా దుండగులు లక్ష్యంగా చేసుకోవడం రైతులను కలవరానికి గురిచేస్తోంది.గ్రామ సర్పంచ్ మద్దూరి శంకర్ మాట్లాడుతూ.. ఇదే లిఫ్ట్ కేంద్రంలో మూడోసారి చోరీ జరగడం అత్యంత దురదృష్టకరమన్నారు. గతంలో జరిగిన రెండు చోరీ కేసుల్లో ఇప్పటికీ నిందితులను గుర్తించకపోవడం ఆందోళనకరమని అన్నారు. డాగ్ స్క్వాడ్, ఫింగర్‌ప్రింట్ నిపుణులతో ప్రత్యేక దర్యాప్తు చేపట్టి నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి సాగునీటి సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించాలని అధికారులను కోరారు.సీసీ కెమెరాలు పనిచేసి ఉంటే...రైతు నాయకుడు గూడెపు శివారెడ్డి మాట్లాడుతూ.. గతంలో రెండుసార్లు కేబుల్ వైర్లు చోరీకి గురైనా నిందితులను పట్టుకోలేదన్నారు. ఇప్పుడు ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్లను సైతం అపహరించడం బాధాకరమన్నారు. లిఫ్ట్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేసి ఉంటే దొంగలను సులభంగా గుర్తించే అవకాశముండేదని తెలిపారు. కృష్ణా నదిలో నీటి విడుదల సమయంలో ఈ ఘటన జరిగి ఉంటే వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉండేదని ఆందోళన వ్యక్తం చేశారు.పోలీసులకు ఫిర్యాదు.. నష్టం అంచనా వర్క్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేసినట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు జరిగిన నష్టం, అపహరణకు గురైన కాపర్ వైర్ల విలువను విద్యుత్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారని చెప్పారు. ఘటనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, నిందితులను త్వరగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునేలా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు జగదీశ్వర్ రెడ్డి, జాషువా, లస్కర్లు సాయిరాం, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, శ్యామ్ సుందర్ రెడ్డి, ఆంజనేయులు, బాలయ్య, గ్రామ రైతు కమిటీ అధ్యక్షుడు పింజరి భాష, గ్రామ సర్పంచ్ మద్దూరి శంకర్, రైతు నాయకుడు గూడెపు శివారెడ్డి, రైతు సమన్వయ కమిటీ మాజీ అధ్యక్షుడు మద్దిలేటి మోహన్, రాజు, పలువురు రైతులు పాల్గొన్నారు.



# ఉచిత బస్సు పథకం... ఉపాధికి ఉరి!

### కాంగ్రెస్ వైఫల్యంతో రోడ్డున పడిన ఆటో కార్మికులు'

**మహబూబ్‌నగర్ జులై 16 ( ప్రజా జ్యోతి బ్యూరో) :**
కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు పేదల జీవనోపాధిని దెబ్బతీస్తున్నాయనే విమర్శలు మరోసారి వినిపించాయి. మహిళలకు ఉచిత బస్సు పథకంతో ఇప్పటికే తీవ్ర ఆదాయ నష్టాన్ని ఎదుర్కొంటున్న ఆటో కార్మికులకు, ఇప్పుడు బస్టాండ్ ముందు ఆటోలు నిలపొద్దంటూ అధికారులు ఆంక్షలు విధించడం మరింత ఆందోళనకు గురిచేసింది. ఈ నేపథ్యంలో మహబూబ్‌నగర్ బస్టాండ్ ముందు నిరసన చేపట్టిన ఆటో డ్రైవర్లను పోలీసులు స్టేషన్‌కు తరలించిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అక్కడికి చేరుకుని వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆటో డ్రైవర్లతో కలిసి బస్టాండ్ వద్దకు వెళ్లి అధికారులతో చర్చించి సమస్యకు పరిష్కారం చూపించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేసిన తర్వాత ఆటో డ్రైవర్ల ఆదాయం గణనీయంగా తగ్గిపోయిందని, ఆటో కార్మికులను ఆదుకుంటామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి సహాయక చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు కేవలం మాటలకే పరిమితమయ్యాయని ఆరోపించారు. ఏళ్ల తరబడి బస్టాండ్ ముందు క్రమపద్ధతిలో ఆటోలు నిలిపి ప్రయాణికులకు సేవలందిస్తున్నారని, బస్సుల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా డ్రైవర్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. అక్కడ కూడా ఆటోలు నిలపకుండా నిషేధిస్తే వేలాది ఆటో కార్మికుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి



వస్తుందని అన్నారు. పిల్లల చదువులు, కుటుంబ పోషణ, బ్యాంకు రుణాల చెల్లింపులు వంటి బాధ్యతలు ఉన్న నేపథ్యంలో అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కోరారు. చర్చల అనంతరం అధికారులు సూచించిన నిబంధనల మేరకు క్రమపద్ధతిలో ఆటోలు నిలిపి, బస్సులకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా ప్రయాణికులను ఎక్కించుకోవాలని ఆటో డ్రైవర్లను కోరారు. దీనికి డ్రైవర్లు అంగీకరించడంతో, బస్టాండ్ ముందు ఆటోలు నిలిపేందుకు అధికారులు అనుమతి ఇచ్చారు. సమస్య తెలిసిన వెంటనే స్పందించి, పరిష్కారం కోసం చొరవ తీసుకున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు ఆటో డ్రైవర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, సీనియర్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టిడబ్ల్యూజేఎఫ్‌లో భారీగా జర్నలిస్టుల చేరిక





### - అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల కోసం ఉద్యమం తప్పదు : డా. బండి విజయ్ కుమార్

**మహబూబ్‌నగర్, జూలై 16 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
జిల్లాలో పనిచేస్తున్న ప్రతి జర్నలిస్టుకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. బండి విజయ్ కుమార్ డిమాండ్ చేశారు.మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం, తెలంగాణ చౌరస్తాలోని టిడబ్ల్యూజేఎఫ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో గురు వారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు భారీగా యూనియన్‌లో చేరారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో డా. బండి విజయ్ కుమార్ మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక సంఘం టిడబ్ల్యూజేఎఫ్ మాత్రమేనని అన్నారు. ప్రస్తుతం జిల్లాలో అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ తీవ్ర గందరగోళానికి గురైందని, దరఖాస్తు చేసుకున్న అనేక మంది జర్నలిస్టులకు ఇప్పటికీ మండల స్థాయి అక్రిడిటేషన్ కార్డులు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పౌరసంబంధాల అధికారి (డీపీఆర్వో) మరియు అక్రిడిటేషన్ కమిటీ సభ్యుల మధ్య సమన్వయ లోపం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు.
అర్హత కలిగి దరఖాస్తు చేసుకున్న ప్రతి జర్నలిస్టుకు ఎలాంటి వివక్ష లేకుండా అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, అలాగే జర్నలిస్టుల ఇళ్ల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టి జర్నలిస్టుల హక్కుల సాధన కోసం పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం. గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ గండీటి నరసింహ, జిల్లా ఉపాధ్యక్షులు పానుగంటి సురేందర్, ఖాజా మైనొద్దీన్, ఆర్.కే. శ్రీనివాస్, శ్యామ్యూల్ సుందర్ చారి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

# విద్యారంగానికి... అధిక శాతం నిధులు కేటాయించాలి

### - ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి
### - సిపిఎం అచ్చంపేట మండల కార్యదర్శి వర్ధశీ సైదులు

**నాగర్ కర్నూల్ జులై 16 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**
ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిపిఐఎం అచ్చంపేట మండల కార్యదర్శి వర్ధశీ సైదులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అచ్చంపేట పట్టణంలో ఉన్న జి హెచ్ ఎస్ ప్రభుత్వ పాఠశాలలను సర్వే చేయడం జరిగింది విద్యార్థుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి వర్ధశీ సైదులు మాట్లాడుతూ... పాఠశాలలో తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని వారు కోరారు..పాఠశాలలో ఖాళీగా ఉన్న సోషల్ టీచర్ ని తక్షణమే భర్తీ చేయాలని విద్యాధికారులని డిమాండ్ చేశారు పాఠశాలల్లో ల్యాబ్ సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు విద్యార్థులు భోజనం చేయడానికి డైనింగ్ హాలును తక్షణమే నిర్మాణంలో ఉంది కానీ పూర్తిగా కాలేదు తక్షణమే పూర్తి చేయాలని కోరారు విద్యార్థులకి బిల్డింగ్ సౌకర్యం ఉంది కానీ మరుమతులు లేక శుభ్రంగా లేక విద్యార్థులు ఇబ్బందులకు గురి అవుతున్నారు తక్షణమే ప్రభుత్వ అధికారిలు స్పందించి పూర్తిస్థాయిలో బిల్డింగ్ ని నిర్మాణం చేపట్టాలని వారు డిమాండ్ చేశారు సిపిఎం టౌన్ కార్యదర్శి రాములు గారు శంకర్ ఎస్ఎఫ్ఐ నాయకులు చరణ్ రాజు రవి పాల్గొన్నారు.



## నాగర్‌కర్నూల్‌కు బదిలీ అయిన సాంస్కృతిక సారథి కళాకారులకు ఘన వీడ్కోలు

### ఐదేళ్లుగా ప్రభుత్వ పథకాలను జానపద కళారూపాలతో ప్రజల్లోకి తీసుకెళ్లిన నలుగురు కళాకారులు



**మహబూబ్‌నగర్, జూలై 16 (ప్రజా జ్యోతి బ్యూరో):**
మహబూబ్‌నగర్ జిల్లాలో గత ఐదేళ్లుగా సేవలందిస్తున్న తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు నలుగురు నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీ అయ్యారు. తెలంగాణ సాంస్కృతిక సారథి రాష్ట్ర కార్యాలయం ఆదేశాల మేరకు ఈ బదిలీలు జరిగాయి. బదిలీపై వెళ్తున్న ఎం. జయప్రకాష్, బైండ్ల లక్ష్మణ్, కె. విజయకాంత్, కె. ఉదయ్‌కుమార్‌లు గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా పౌర సంబంధాల శాఖ (డీపీఆర్వో) కార్యాలయంలో జిల్లా పౌర సంబంధాల అధికారి పి. శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం డీపీఆర్వో పి. శ్రీనివాస్ వారిని పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డీపీఆర్వో పి. మాట్లాడుతూ, గత ఐదేళ్లుగా ఈ కళాకారులు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారంతో పాటు పరిసరాల పరిశు భ్రత, రోడ్డు భద్రత, ఓటరు అవగాహన, బాల కార్మికుల నిర్మూలన, మూఢనమ్మకాల నిర్మూలన వంటి సామాజిక అంశాలపై జానపద కళారూపాలు, ఆటపాటల ద్వారా ప్రజల్లో విశేష చైతన్యం తీసుకొచ్చారని కొనియాడారు. ఇదే సేవా స్ఫూర్తితో నాగర్‌కర్నూల్ జిల్లాలో కూడా ప్రభుత్వ పథకాలు, సామాజిక అంశాలపై సమర్థవంతంగా అవగాహన కల్పించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తోటి సాంస్కృతిక సారథి కళాకారులు సంతోష్, పద్మ, అశోక్ చారి, ఇతర సిబ్బంది బదిలీపై వెళ్తున్న కళాకారులను పూలదండలు, శాలువాలతో ఘనంగా సన్మానించి, స్వీట్లు తినిపించి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు.

## తైక్వాండో పోటీలకు అచ్చంపేట సిద్ధం

### -- -19న పబ్లిక్ క్లబ్ వేదికగా ఛాంపియన్‌షిప్
### -- యువ క్రీడాకారుల ప్రతిభకు వేదికగా పబ్లిక్ క్లబ్





**అచ్చంపేట, జూలై 16 ప్రజా జ్యోతి)**
నాగర్‌కర్నూల్ జిల్లా స్థాయి తైక్వాండో..ఛాంపియన్‌షిప్--2026 పోటీలకు అచ్చంపేట సిద్ధమవుతోంది. ఈ నెల 19 (ఆదివారం) అచ్చంపేట పబ్లిక్ క్లబ్ వేదికగా నాగర్‌కర్నూల్ జిల్లా తైక్వాండోఅసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు పబ్లిక్ క్లబ్ అధ్యక్షులు అంగిరేకుల బిక్షపతి, ఉపాధ్యక్షులు కందికొండ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి కానోజు మనోహర్ ప్రసాద్ (మన్ను పటేల్), సహాయ కార్యదర్శి మహమ్మద్ ఫయీం, కోశాధికారి పోకల ప్రవీణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొననున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. వయోపరిమితుల వారీగా వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు ట్రోఫీలు, పతకాలు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు ముందస్తుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు, ఇతర వివరాల కోసం జిల్లా తైక్వాండో ప్రతినిధి శేఖర్ (97051 29084) ను సంప్రదించాలని కోరారు. తల్లిదండ్రులు, క్రీడాభిమానులు అధిక సంఖ్యలో హాజరై యువ క్రీడాకారులను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు, కోచ్‌లు, ప్రతినిధులకు పబ్లిక్ క్లబ్ కార్యవర్గం తమ సొంత ఖర్చులతో ఉచిత భోజన వసతి కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు అధ్యక్షులు అంగిరేకుల బిక్షపతి, ఉపాధ్యక్షులు కందికొండ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి కానోజు మనోహర్ ప్రసాద్, సహాయ కార్యదర్శి మహమ్మద్ ఫయీం, కోశాధికారి పోకల ప్రవీణ్ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి మనోహర్ ప్రసాద్ వెల్లడించారు.

# అద్దె వాహనాల సమ్మె ఉధృతం..

**- సచివాలయం ముట్టడికి యత్నించిన రాష్ట్ర నాయకుల అరెస్ట్**



**మహబూబ్‌నగర్ జూలై 16 (ప్రజా జ్యోతి బ్యూరో )**

తెలంగాణ ప్రభుత్వ అద్దె వాహనాల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శాఖలకు సేవలందిస్తున్న అద్దె వాహనాలను నిలిపివేసి డ్రైవర్లు, యజమానులు శాంతియుత నిరసన కార్యక్రమాలు చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని సంఘం నాయకులు స్పష్టం చేశారు.సంఘం ప్రధాన డిమాండ్లలో పెండింగ్‌లో ఉన్న అద్దె వాహనాల బిల్లులను వెంటనే విడుదల చేయడం, ప్రస్తుతం నెలకు చెల్లిస్తున్న ?33 వేల అద్దెను ?55 వేలకు పెంచడం, అలాగే ప్రతి నెల 5వ తేదీలోపు బిల్లులను తప్పనిసరిగా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవడం ఉన్నాయి.

మహబూబ్‌నగర్ జిల్లా అద్దె వాహనాల సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో ప్రభుత్వ అద్దె వాహనాలను నిలిపివేసి శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రభుత్వ అద్దె వాహనాల డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను సానుకూలంగా పరిశీలించి, న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.ఇదిలా ఉండగా, రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనలో భాగంగా హైదరాబాద్‌లో సచివాలయం వద్ద నిరసన చేపట్టేందుకు వెళ్లిన తెలంగాణ రాష్ట్ర అద్దె వాహనాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అయూబ్‌తో పాటు పలువురు సంఘం నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యలకు పరిష్కారం చూపాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని సంఘం నాయకులు హెచ్చరించారు.

# శ్రీ జగన్నాథ రథయాత్రలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

**రాష్ట్ర సుభిక్షం కోసం ప్రత్యేక ప్రార్థనలు**





**మహబూబ్‌నగర్ జూలై 16 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో వైభవంగా నిర్వహించిన శ్రీ జగన్నాద ?స్వామి రద ?యాత్రలో మాజీ మంత్రి విరసనోల్ల శ్రీనివాస్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథయాత్రలో భాగంగా శ్రీ జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించిన రథాలపై భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ భక్తులతో కలిసి రథయాత్రలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని, పంటలు బాగా పండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని శ్రీ జగన్నాథ స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. రథయాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తి పారవశ్యంలో స్వామివారికి జైజైధ్వానాలు చేస్తూ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# ప్రభుత్వ పాఠశాలలు కళాశాలలో సమస్యలపై సిపిఎం బృందం ఆరా.

**టీచర్ల కొరత టాయిలెట్లు గ్రంథాలయం కంప్యూటర్లు పిడి పోస్టులు భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్.**



**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్**

సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు జూనియర్ కళాశాలలను సిపిఎం పార్టీ బృందం సోమవారం రోజు సందర్శించి అక్కడ సమస్యలను పరిశీలించింది ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలల్లో నెలకొన్న మౌలిక వసతుల కోరతపై వివరాలను సేకరించారు. మండల కమిటీ సభ్యులు నక్క ఈశ్వర్ జక్కుల ఆశన్న మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని విద్యార్థులకు అవసరమైన టాయిలెట్లు గ్రంథాలయం కంప్యూటర్ సదుపాయాలు లేకపోవడం వల్ల నాణ్యమైన విద్యకు ఆటంకం కలుగుతుందన్నారు. జూనియర్ కళాశాలలో పిడి ఫిజికల్ డైరక్టర్ పోస్టులు లకపోవడంతో విద్యార్థులు క్రీడాలకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా జూనియర్ కళాశాలలో ప్రహరీ గోడలు మరమ్మతులు ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి కాళీ పోస్టులను భర్తీ చేయడంతో పాటు అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని విద్యాశాఖ మంత్రి మరియు ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సాధించి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు సిహెచ్ వెంకటయ్య నక్క ఆంజనేయులు రామకృష్ణ జెట్టి నవీన్ సిసింద్ర వెంకటేశ్వర్ గౌడ్ అనకలి రాజు శరత్ వెంకన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు



# గ్రామ అభివృద్ధికి పాటుపడుదాం

**సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి**

**4 వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి భూమి పూజ**

**కల్వకుర్తి,జులై 16 (ప్రజా జ్యోతి):**

గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరం పాటు పడదామని మార్చాల గ్రామ సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి అన్నారు. గురువారంకల్వకుర్తి మండల పరిధిలోని మార్చాల గ్రామంలో 4 వార్డుల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు సర్పంచ్ భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని, గ్రామ ప్రజలందరి సహాయ సహకారాలతో ముందుకు సాగుతానని తెలిపారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.గ్రామంలో పారిశుద్ధ్య సమస్యల పరిష్కారం కోసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటుచేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, వార్డు సభ్యులు రజిత మల్లేష్, సుమంత రాజశేఖర్, కిషోర్, యాదయ్య, అనురాధ జంగయ్య, అక్షయ విశ్వేశ్వర్, అలివేల జంగమయ్య, స్వాతి బాలరాజు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



# భూముల రీ-సర్వేపై రైతులకు అవగాహన కల్పించాలి

## తహసీల్దార్ ఝాన్సీ రాణి

**మల్దకల్ జూలై 16(ప్రజా జ్యోతి):**


మల్దకల్ మండల పరిధిలోని నేతివానిపల్లె గ్రామంలో గురువారం భూ భారతి భూముల రీ-సర్వే కార్యక్రమంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ ఝాన్సీ రాణి మాట్లాడుతూ,రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన భూముల రీ-సర్వేలో భాగంగా మల్దకల్ మండలంలోని ఏడు గ్రామాలను ఎంపిక చేసి దశలవారీగా సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.నేతివానిపల్లె గ్రామంలో కూడా రీ-సర్వే చేపట్టనున్నట్లు ఆమె పేర్కొన్నారు. గ్రామ కంఠం,గ్రామ శివారు,రహదారులు,పట్టా భూములు,ప్రభుత్వ భూములు తదితర భూభాగాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేసి ఖచ్చితమైన భూ రికార్డులు సిద్ధం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు.రైతులు రీ-సర్వే ప్రక్రియకు పూర్తి సహకారం అందించి,అవసరమైన భూ పత్రాలను అధికారులకు అందజేయాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ బీచుపల్లి, సీనియర్ అసిస్టెంట్ కరీం,జీపీవో,సర్పంచ్ పద్మా వెంకటేష్ నాయక్,గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.నేటి నుంచి ఈ నెల 21వ తేదీ వరకు ఎద్దులగూడెం, ఉల్లిగపల్లి,శేషంపల్లి తదితర గ్రామాల్లో కూడా భూముల రీ-సర్వేపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.



# ప్రజా పాలన అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలి

## -రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**నాగర్ కర్నూల్ : జులై 16 (ప్రజా జ్యోతి)**





నాగర్‌కర్నూల్ జిల్లా రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలును మరింత వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు.తాగునీటి సరఫరా,ప్రజారోగ్యం, సీజనల్ వ్యాధుల నివారణ,ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థుల నమోదు,ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణాలు,రైతులకు వాతావరణ పరిస్థితులకనుగుణంగా పంటలపై అవగాహన, ప్రజా పాలన కార్యక్రమాల అమలు తదితర అంశాలపై హైదరాబాద్ సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య,వైద్యం,వ్యవసాయం,తాగునీరు, ప్రజా సేవల రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లాయంత్రాంగం ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయాలన్నారు.వీడియో కాన్ఫరెన్స్‌లో నాగర్ కర్నూల్ నుంచి కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పాల్గొని జిల్లాలో వివిధ శాఖల్లో చేపడుతున్న కార్యక్రమాల పురోగతిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి వివరించారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేందుకు ఇప్పటికే మండల విద్యాధికారులు ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి విద్యార్థుల నమోదుకు గ్రామస్థాయిలో అవగాహన చేపట్టడంతో జిల్లాలో నమోదు శాతం పెరుగుతోందని,నాగర్‌కర్నూల్, అచ్చంపేట,కొల్లాపూర్ నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల పనులు వేగంగా సాగుతున్నాయని,నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా పర్యవేక్షణ చేస్తున్నామని మోడల్ స్కూళ్ల ఎంపిక,అభివృద్ధికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలను కూడా సిద్ధం చేస్తున్నామని,భారత వాతావరణ శాఖ హెచ్చరికలు,సూచనల్ని ఎప్పటికప్పుడు రైతులకు చేరవేస్తున్నామని,రైతు వేదికల ద్వారా సేంద్రియ వ్యవసాయం,ఉద్యాన పంటలు,ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని,మార్కెట్ అవకాశాలు ఉన్న పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని,సీజనల్ వ్యాధుల నివారణకు వైద్యారోగ్య అధికారుల్ని అప్రమత్తం చేస్తూ పట్టాణాలల్లో గ్రామాలు,వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు,పారిశుధ్య చర్యలు చేపడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని,ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జిల్లా ప్రత్యేక అధికారి ప్రతి నెల జిల్లాను సందర్శించి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలిస్తున్నారని,అందుకు అనుగుణంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ అరుణ రెడ్డి,జిల్లా విద్యాశాఖ,వైద్యారోగ్య శాఖ,వ్యవసాయ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ,పంచాయతీరాజ్ శాఖతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చిన్నమారూర్ లిఫ్ట్‌లో కాపర్ వైర్ చోరీపై బీఎస్పీ,డిమాండ్

**చిన్నంబావి, జులై 16 (ప్రజాజ్యోతి)**



మండల కేంద్రంలోని పెద్దమారూర్ గ్రామ సమీపంలో ఉన్న చిన్నమారూర్ లిఫ్ట్ ఇరిగేషన్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన కాపర్ వైర్లను గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. ఇటీవల లిఫ్ట్ ఇరిగేషన్ ట్రాన్స్‌ఫార్మర్లలో వరుసగా కాపర్ వైర్లు చోరీకి గురవుతుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.ఘటన స్థలాన్ని గురువారం బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) నాయకులు పరిశీలించి లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నంబావి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, దొంగతనాలకు పాల్పడిన వారిని వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర నాయకుడు అంతటి నాగన్న మాట్లాడుతూ, రైతుల సాగునీటికి జీవనాడిగా ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని కాపర్ వైర్లు దొంగిలించడం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం తగిన వర్షాలు లేక రైతులు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారానే పంటలకు నీటిని అందిస్తున్నారని, ఇలాంటి సమయంలో కాపర్ వైర్ల చోరీల వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి సాగునీటి పంపిణీ నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. దీంతో రైతులకు, పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని పేర్కొన్నారు. వరుస చోరీలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాపర్ వైర్ దొంగతనాలకు పాల్పడిన నిందితులను వెంటనే గుర్తించి అరెస్టు చేసి చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఇన్‌చార్జి కళ్యాణ్, జిల్లా కార్యదర్శి దాసు, కొల్లాపూర్ అసెంబ్లీ ఇన్‌చార్జి మునిస్వామి, అధ్యక్షుడు బొల్లి కురుమయ్యతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏక్ పేడ్ మాకే నామ్!

## -ప్రతి విద్యార్థి తల్లి పేరుతొ ఒక మొక్క నాటాలి

## -అసోసియెట్ డిన్ అనిత

**నాగర్ కర్నూల్ : జులై 16 (ప్రజా జ్యోతి)**

నాగర్ కర్నూల్ నియోజకవర్గంలోని పాలెంలోగల వ్యవసాయ కళాశాలలో "ఏక్ పేడ్ మా కే నామ్"కార్యక్రమాన్ని నిర్వహించారు.ఇన్‌చార్జ్ అసోసియే ట్ డీన్ అనిత ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ,వాతావరణ హరితాభివృద్ధి,సమతుల్యతను కాపాడడంలో మొక్కల ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు."ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమం ఉద్దేశానికి అనుగుణంగా ప్రతి విద్యార్థి తన తల్లి పేరుతో మొక్కను నాటి,సంరక్షింస్తామని ప్రతిజ్ఞచేశారు.ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ అసోసియేట్ డీన్ అనిత మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని,నాటిన మొక్కలను సంరక్షించడంతో భవిష్యత్ తరాలకు పచ్చని వాతావరణాన్ని అందించవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్.కార్యక్రమ అధికారి వి.శ్రీరమ్య, డా.ఎం.భానుశ్రీ, కళాశాల హెచ్.వో.డి డా.సి.హెచ్.ప్రగతి కుమారి,ప్రొఫెసర్లు,ఓఐఎస్‌ఏ డా.వి.స్వర్ణలత,ఇతర అధ్యాపకులు,బోధనేతర సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.



# గ్రామ అభివృద్ధికి పాటుపడుదాం

## సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి

## 4 వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి భూమి పూజ



**కల్వకుర్తి,జులై 16 (ప్రజా జ్యోతి):**

గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరం పాటు పడదామని మార్చాల గ్రామ సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి అన్నారు. గురువారం కల్వకుర్తి మండల పరిధిలోని మార్చాల గ్రామంలో 4 వార్డుల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు సర్పంచ్ భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని, గ్రామ ప్రజలందరి సహాయ సహకారాలతో ముందుకు సాగుతానని తెలిపారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.గ్రామంలో పారిశుధ్య సమస్యల పరిష్కారం కోసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటుచేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, వార్డు సభ్యులు రజిత మల్లేష్, సుమంత రాజశేఖర్, కిషోర్, యాదయ్య, అనురాధ జంగయ్య, అక్షయ విశ్వేశ్వర్, అలివేల జంగమయ్య, స్వాతి బాలరాజు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# యూపీఎస్సీలో వరుస విజయాలు..

## - ఎస్సీ స్టడీ సర్కిల్ డాక్యుమెంటరీ బుక్‌లెట్ ఆవిష్కరణ

**మహబూబ్‌నగర్, జూలై 16 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్, బంజారాహిల్స్, హైదరాబాద్ ఆధ్వర్యంలో రూపొందించిన డాక్యుమెంటరీ బుక్‌లెట్లను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఐఏఎస్, గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ శిక్షణ పొందిన విద్యార్థులు యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో విశేష ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. యుపి ఎస్ సి 2024-25 ఫలితాల్లో ఇద్దరు, 2025-26 ఫలితాల్లో మరో ఇద్దరు విద్యార్థులు ప్రతిష్టాత్మక ర్యాంకులు సాధించడం సంస్థ శిక్షణ నాణ్యతకు నిదర్శనమన్నారు. అదేవిధంగా టి జి పీ ఎస్ సి 2024-25 ఫలితాల్లో స్టడీ సర్కిల్ విద్యార్థులు 33 గ్రూప్-1, 25 గ్రూప్-2, 26 గ్రూప్-3, 54 గ్రూప్-4 ఉద్యోగాలను సాధించి తమ ప్రతిభను చాటుకున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో 10 నెలలపాటు నిర్వహించే ఉచిత యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ కోచింగ్‌ను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు జూలై 19లోగా దరఖాస్తు చేసుకోవాలని, జూలై 26న హైదరాబాద్‌లో అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.దరఖాస్తులను తెలంగాణ స్టడీ సర్కిల్ అధికారిక వెబ్‌సైట్ అయిన [TS Study Circle](https://tsstudycircle.co?utm_sourceRchatgpt.com) ద్వారా సమర్పించవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) డి. మధుసూదన్ నాయక్, ఐఏఎస్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియా, డీడీఎస్‌సీడీడీ డి. సునీత, స్టడీ సర్కిల్ డైరెక్టర్ కాడం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక తరలిస్తు నెంబర్ ప్లేట్ ను తొలిగించి పుష్ప తరహాలో టిప్పర్

**కృష్ణా మండల జులై 16 (ప్రజా జ్యోతి)**

నారాయణ పేట జిల్లా కృష్ణా మండలం లోగుడెబల్లూర్ గ్రామంలో కృష్ణా పోలీస్ వారు గస్తీ తిరుగుతుండగా రోడ్డు వద్ద ఒక టిప్పర్ అనుమానాస్పదాంగా వెళు తుండగా దానిని ఆపి చెక్ చేయగా దాన్ని నిండా ఇసుక తీసుకో ఉన్నది మరియు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా కృష్ణా నది నుండి తరలిస్తునందున వల్ల అట్టి టిప్పర్ కె ఏ 32 ఏ ఏ 5085 ను పోలీస్ స్టేషన్ కు తరలించి డ్రైవర్ షేక్ మహబూబ్ సనాఫ్ షేక్ ఇబ్రహీం వయస్సు38 టిప్పర్ యజమాని శ్రీకాంత్ సనాఫ్ బహిరం రాథోడ్ మీద కేస్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యస్ ఐ నవీద్ తెలిపారు చేయడం జరిగింది

